సాక్షి కామారెడ్డి

శనివారం । 22 । జూలై । 2023



కళాశాల మంజూరు చేయండి
బీబీపేటకు జూనియర్ కళాశాల మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ విద్యాశాఖ మంత్రిని కోరారు.
- 9లో ▸



నాలాలతో అవస్థలు
బాన్సువాడ పట్టణంలో డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోతోంది.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
27.5 /22.4

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

విద్యాసంస్థలకు సెలవు పొడిగింపు

సాక్షి, కామారెడ్డి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం విద్యాసంస్థలకు ఇచ్చిన సెలవులను పొడిగించింది. శనివారం కూడా సెలవు ప్రకటించింది. వర్షాల నేపథ్యంలో ఇప్పటికే గురు, శుక్రవారాలలో సెలవు ఇచ్చిన విషయం తెలిసిందే. వర్షాలు తగ్గకపోవడంతో సెలవులను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

'పల్లె ప్రగతిని పకడ్బందీగా నిర్వహించాలి'



కామారెడ్డి రూరల్: పల్లె ప్రగతి పనులను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి అధికారులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా వారి పనితీరు, సామర్థ్యాలను పరిశీలించేందుకు అదనపు కలెక్టర్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు శుక్రవారం శాబ్దిపూర్, గూడెం గ్రామాలలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన పల్లె ప్రకృతివనం, నర్సరీ, కంపోస్టు షెడ్లు, క్రీడా ప్రాంగణం, శ్మశాన వాటికలను పరిశీలించారు. గర్గుల్ నుంచి శాబ్దిపూర్ వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఆయా పనులకు సంబంధించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అన్యోన్య, డీఎఫ్‌వో నిఖిత, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎంపీవో మలహరి, పంచాయతీ కార్యదర్శులు గణేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

సదాశివనగర్: సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్ సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అన్ని గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. ఆస్పత్రిలో సిబ్బంది అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఆస్మా అఫ్షిన్, సీహెచ్‌వో నాగరాజు, సూపర్‌వైజర్ నక్షత్ర పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి డీఎస్పీ బదిలీ రద్దు

సాక్షి, కామారెడ్డి: ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు బదిలీ రద్దయ్యింది. ప్రభుత్వం ఇటీవల ఆయనను బదిలీ చేసిన విషయం తెలిసిందే.. ప్రభుత్వం దీనిని రద్దు చేసింది. ఆయనను యథాస్థానంలో కొనసాగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

'చేపల వాహనాలకు దరఖాస్తు చేసుకోండి'

కామారెడ్డి క్రైం: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద సంచార చేపల వాహనాలు, మూడు చక్రాల వాహనాలు, ఐస్ బాక్సులను సబ్సిడీపై ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని జిల్లా మత్స్య శాఖ అధికారి వరదారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఉంటుందని వివరించారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల 18 నుంచి 50 ఏళ్లలోపు మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సభ్యులు కలెక్టరేట్‌లోని జిల్లా మత్స్యశాఖ అధికారి కార్యాలయంలో ఈనెల 26 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కమిషనర్ సంతకం ఫోర్జరీ

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ కమిషనర్ రమేశ్ సంతకాన్ని ఓ వ్యక్తి ఫోర్జరీ చేశాడు. వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడ –బోర్లం రోడ్డులో పట్టణానికి చెందిన ఓ వ్యక్తి రేకుల షెడ్డు నిర్మించాడు. దీనికి విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు ఫారంపై సదరు వ్యక్తి కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసి ట్రాన్స్‌కో అధికారులకు సమర్పించాడు. ట్రాన్స్‌కో అధికారులు రేకుల షెడ్డుకు కరంటు మీటర్ పెట్టుకునేందుకు అనుమతించారు. రేకుల షెడ్డుకు విద్యుత్ మీటర్ ఎలా ఇచ్చారని పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు సమాచార హక్కు చట్టం కింద ట్రాన్స్‌కో అధికారులకు దరఖాస్తు చేశారు. దీంతో విద్యుత్ మీటర్‌కు సంబంధించిన దరఖాస్తు ఫారంపై ఉన్న సంతకం మీదేనా అని ట్రాన్స్‌కో అధికారులు బల్దియా కమిషనర్ రమేశ్‌ను వివరణ కోరగా అసలు విషయం బయటపడింది. తన సంతకం ఫోర్జరీ చేశారని రమేశ్ తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు.



బాన్సువాడ రూరల్: కాద్లాపూర్ శివారులో నీట మునిగిన పంట



తాద్వాయి: సంతాయిపేట్ శివారులో ఉప్పొంగి ప్రవహిస్తున్న భీమేశ్వర వాగు



నిజాంసాగర్: పొంగిపొర్లుతున్న సింగితం రిజర్వాయర్

ప్రాజెక్టులకు జలకళ

- పొంగుతున్న పోచారం, సింగితం, కల్యాణి ప్రాజెక్టులు
- అడుగు దూరంలో కౌలాస్ నాలా
- నిజాంసాగర్‌లో నాలుగు టీఎంసీల వరద నీరు చేరిక
- అలుగులు పారుతున్న చెరువులు, కుంటలు
- అన్నదాతల్లో హర్షం

వరుణుడు కరుణను వర్షించడంతో జిల్లా జలకళను సంతరించుకుంది. చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి. ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. వారం క్రితం వరకు వానలు లేక సాగు పనులు ముందుకు సాగక ఆందోళన చెందిన అన్నదాత.. ప్రస్తుత జలకళను చూసి మురిసిపోతున్నాడు. పలుచోట్ల చెరువులు, కుంటలకు బుంగలు, గండ్లు పడుతుండగా.. రైతులు ఎక్కడికక్కడ వాటిని సరిచేస్తున్నారు.

నాగిరెడ్డిపేట: అలుగు పారుతున్న పోచారం ప్రాజెక్టు



సాక్షి, కామారెడ్డి: నెలన్నరపాటు దోబూచులాడిన వరుణుడు ఆలస్యంగానైనా కరుణించాడు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నీటి వనరులన్నీ జలకళను సంతరించుకున్నాయి. వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో రైతుల్లో ఆశలూ చిగురించాయి. పోచారం, కౌలాస్‌నాలా, కల్యాణి ప్రాజెక్టులు, సింగితం రిజర్వాయర్‌తోపాటు చెరువులు, కుంటలు కళకళలాడుతున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయినిగా పేరొందిన నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో రైతులు వానాకాలం వరి సాగు పనులు ముమ్మరం చేశారు. నిన్నమొన్నటి వరకు నాట్లు వేసేందుకు వెనకాముందైన రైతులు.. ప్రస్తుతం వర్షంలోనూ పనుల్లో నిమగ్నమయ్యారు.

నిజాంసాగర్‌లోకి భారీ వరద..

ఉమ్మడి జిల్లా సాగునీటి అవసరాలు తీర్చే నిజాంసాగర్ ప్రాజెక్టులో నాలుగు రోజుల్లో నాలుగు టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు(1,405 అడుగులు) కాగా.. ఈనెల 16న 3.1387 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సాగర్ నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 7.520 టీఎంసీల(1,395.90 అడుగులు)కు చేరింది. పోచారం ప్రాజెక్టు అలుగుపారుతుండడం, హల్దీవాగు, పసుపులేరు, ఘణపురం ఆనకట్టల ద్వారా మంజీర నదికి భారీగా వరద వస్తోంది. శనివారం సాయంత్రం 38,700 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో ఉంది. ఇలాగే వర్షాలు కురిస్తే వారం రోజుల్లో నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుతుందని భావిస్తున్నారు.

మత్తడి దూకుతున్న చెరువులు

జిల్లాలో 1,515 చెరువులు, కుంటలు ఉండగా ఇప్పటికే 235 చెరువులు అలుగులు దుంకాయి. మరో 150 చెరువులు, కుంటలు అలుగులు దూకడానికి సిద్ధంగా ఉన్నాయి. మిగతా వాటిలోకి కూడా వరద నీరు వస్తోంది. మరో మూడు, నాలుగు రోజుల్లో చెరువులు, కుంటలన్నీ అలుగులు పారుతాయని భావిస్తున్నారు.

కౌలాస్ నాలాలో..



జుక్కల్ మండలంలోని కౌలాస్‌నాలా ప్రాజెక్టులోకి వరద స్వల్పంగా వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 458 అడుగులు(1.232 టీఎంసీలు) కాగా.. వారం క్రితం వరకు 0.627 టీఎంసీల నీరే ఉంది. శుక్రవారం సాయంత్రం 231 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఏఈ రవిశంకర్ తెలిపారు. ప్రాజెక్టులో 456.40 అడుగుల(0.880 టీఎంసీ) నీరుందన్నారు. ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో రేపటిలోగా నిండుతుందని భావిస్తున్నారు.

నేడు పోచారం నీటి విడుదల

నాగిరెడ్డిపేట: ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ చేతుల మీదుగా దిగువకు నీటిని విడుదల చేయనున్నారు. ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు శుక్రవారం పోచారం ప్రాజెక్టును సందర్శించి, నీటిని పరిశీలించారు. ఆయకట్టు పరిధిలోని భూముల్లో ఖరీఫ్ పంటలసాగుకోసం శనివారం ఉదయం 11 గంటలకు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరవ్వాలని కోరారు.

సింగితం, కల్యాణీలలో..



ఎల్లారెడ్డి, నిజాంసాగర్ మండలాల్లోని కల్యాణి ప్రాజెక్టు, సింగితం రిజర్వాయర్లలో వరద పోటెత్తింది. కల్యాణి ప్రాజెక్టులోకి శుక్రవారం 1,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. దీంతో ప్రాజెక్టు మూడు వరద గేట్లను ఎత్తి మంజీర నదిలోకి 1,100 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. మరో వంద క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ మెయిన్ కెనాల్‌కు మళ్లించామని పేర్కొన్నారు.

సింగితం రిజర్వాయర్‌లోకి శుక్రవారం 600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 416.5 మీటర్లకు చేరుకోవడంతో సాయంత్రంనుంచి అలుగుపైనుంచి నీరు పారుతోంది. అలుగు అందాలను వీక్షించడానికి పర్యాటకులు వస్తున్నారు.

కొట్టుకుపోయిన బీటీ రోడ్డు



సదాశివనగర్: తిర్మన్‌పల్లి తండాకు వెళ్లే బీటీ రోడ్డు వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో గతంలో బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని సర్పంచ్ బాల్‌రెడ్డి ఆరోపించారు. కాలువ ఉన్న ప్రదేశంలో పైపులు వేసి చేతులు దులుపుకున్నారన్నారు. దీంతో వరద ఉధృతికి రోడ్డు కొట్టుకుపోయిందని పేర్కొన్నారు.

మొన్నటిదాకా డెడ్ స్టోరేజీలో..



ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు నీరందించే పోచారం ప్రాజెక్టు నాలుగు రోజుల క్రితం డెడ్‌స్టోరేజీలో ఉంది. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. బుధవారం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 11 అడుగులకు చేరింది. గురువారం ప్రాజెక్టు నీటిమట్టం 18 అడుగులకు చేరుకుంది. శుక్రవారం ఉదయం పూర్తిస్థాయిలో నిండడంతోపాటు అలుగుపైనుంచి సుమారు రెండు అడుగు ఎత్తులో దిగువకు నీరు ప్రవహిస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 8,932 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అంతే మోతాదులో నీరు అవుట్ ఫ్లోగా వెళ్తూ మంజీరనది ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టు వైపు పరుగులు తీస్తోంది. పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులు(1.82 టీఎంసీలు)లతో నిండుకుండలా ఉంది.

'సింగిల్ విండో'తో సత్ఫలితాలు



భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- బాన్సువాడ సహకార సంఘం నూతన భవనం ప్రారంభం

బాన్సువాడ: సింగిల్ విండో విధానంలో రైతులకు అన్ని రకాల సేవలను ఒకే ప్రదేశంలో అందించడం ద్వారా సహకార సంఘాలు విజయవంతమయ్యాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పాత బాన్సువాడలో రూ.70 లక్షలతో నిర్మించిన సహకార సంఘం భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మీనా గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ 1977లో దేశాయిపేట్ సహకార సంఘం నుంచే తన రాజకీయ జీవితం ప్రారంభమైందన్నారు. తనకు 1987లో నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్‌గా దివంగత నేత ఎన్టీఆర్ నియమించారని పేర్కొన్నారు. దేశంలో పటిష్టమైన, శక్తిమంతమైన వ్యవస్థ సహకార వ్యవస్థేనన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఎప్పుడూ ఎరువుల కొరత తలెత్తకుండా చూశామన్నారు. నిజాంసాగర్ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది జూన్ 21న ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టుకు నీటి విడుదలను ప్రారంభించామన్నారు.

రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. జిల్లాలో బాన్సువాడ ప్రాంత రైతులు ఆదర్శంగా ఉంటున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడంతో వరి నాట్ల నుంచి ధాన్యం కొనుగోళ్ల వరకు ముందుంటున్నారన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఎంపీపీ నీరజా వెంకట్‌రాంరెడ్డి, జెడ్పీటీసీ పద్మ గోపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్సింలు, నాయకులు అంజిరెడ్డి, దివిటి శ్రీనివాస్, సాయిరెడ్డి, సంగ్రాం నాయక్, మోహన్‌నాయక్, ఎజాస్, పాత బాలకృష్ణ, శ్రీధర్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్‌కు డిగ్రీ కళాశాల మంజూరు

మద్నూర్: మండల కేంద్రానికి డిగ్రీ కళాశాల మంజూరైంది. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ విద్యా సంవత్సరమే తరగతులు ప్రారంభించుకోవచ్చని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ప్రాంత విద్యార్థులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్న డిగ్రీ కళాశాల మంజూరు కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కళాశాల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే హన్మంత్ సింధేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

'నిందితులకు శిక్ష పడేలా చూడాలి'

కామారెడ్డి క్రైం: నేరస్తులకు శిక్ష పడేలా నేర పరిశోధన చేయాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్ధ వార్షిక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కోర్టు కేసుల విషయంలో సరైన సమయంలో సాక్షులను, ఆధారాలను ప్రవేశపెట్టి నిందితులకు శిక్షలు పడేలా చూడాలన్నారు. శిక్షల రేటు(కన్విక్షన్)ను పెంచడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూసుకోవాలన్నారు. అనంతరం జిల్లాలో విధులు నిర్వహించి మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాలకు బదిలీపై వెళ్తున్న 22 మంది ఎస్సైలను సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అన్యోన్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పోలీసులకు అభినందన..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణ బాగుందంటూ ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారని, స్టేషన్ అధికారులు తెలిపారు.



బదిలీపై వెళ్తున్న ఎస్సైలతో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎల్లారెడ్డి పీఎస్ పరిధిలో దొంగతనాలు తగ్గాయని స్టేషన్ అధికారులు వివరించారు. గతేడాది మొదటి ఆరు నెలల్లో 26 దొంగతనాలు జరగ్గా.. ఈఏడాది మొదటి ఆరు నెలల్లో 12 దొంగతనాలే జరిగాయి. పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటుండడంతో ఇతర రాష్ట్రాల దొంగలు ఎల్లారెడ్డి ప్రాంతానికి రావడానికి జంకుతున్నారని పోలీసులు ఎస్పీకి వివరించారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో 20 గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, మిగిలిన గ్రామాల్లో వారం రోజుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీంతో నేరాల నియంత్రణలో ముందున్న ఎస్సై గణేశ్‌ను ఎస్పీ అభినందించారన్నారు.

వలకు చిక్కిన పెద్ద చేప



నాగిరెడ్డిపేట: గోలిలింగాల గ్రామశివారులోని చెరువులో శుక్రవారం చేపలు పడుతుండగా.. ఓ యువకుడి వలకు భారీ చేప చిక్కింది. దాని బరువు సుమారు 12 కిలోలు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

'పాత పెన్షన్' వర్తింపజేయండి

- మంత్రి ప్రశాంత్‌రెడ్డికి 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల వినతి

సాక్షి, కామారెడ్డి: తమకు పాత పెన్షన్ పథకం వర్తింపజేయాలని డీఎస్సీ–2003 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం వేల్పూర్‌లో రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కే.శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు దుర్గాప్రసాద్‌రాజు, విజయవర్ధన్ మాట్లాడారు. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందే ఫలితాలు ప్రకటించినప్పటికీ పాలనాపరమైన జాప్యం వల్ల తాము సీపీఎస్ పరిధిలోకి నెట్టివేయబడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. తమలాగే నష్టపోయిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం వర్తింపజేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేశారు. అదే పద్ధతిలో తమకు కూడా పాత పెన్షన్ పథకం వర్తింపజేసే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని మంత్రిని కోరారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. మంత్రిని కలిసినవారిలో ఉపాధ్యాయులు రాజశేఖర్, నరేశ్, శ్రీధర్, శ్రీనివాస్, ఎల్లాగౌడ్, శివ, కిషన్ తదితరులు ఉన్నారు.



మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు

క్లుప్తంగా

24, 25, 26 తేదీల్లో కేజీబీవీ అర్హత పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: కేజీబీవీల్లో వివిధ పోస్టుల భర్తీకి సంబంధించి అర్హత పరీక్షలు జిల్లా కేంద్రంలోనే నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 24, 25, 26 తేదీల్లో నగరంలోని అర్సపల్లి నాలెడ్జ్ పార్క్ స్కూల్‌లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో 80 శాతానికి పైగా మార్కులు పొందిన వంజరి విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు సంఘం ఉపాధ్యక్షులు మాస్టర్ శ్రీనివాస్‌రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అర్హులు సుభాష్‌నగర్‌లోని సంఘ కార్యాలయంలో ఈనెల 31లోపు తమ మార్కుల మెమో, బయోడేటాను అందజేయాలన్నారు. వివరాలకు 9848490055, 9849391493 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దాశరథి జయంతి వేడుకలు వాయిదా

నిజామాబాద్ సిటీ: నగరంలోని ఖిల్లా జైలులో శనివారం జరగాల్సిన దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలు వాయిదా పడ్డాయి. జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వేడుకలను వాయిదా వేసినట్లు ఎమ్మెల్సీ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. జయంతి వేడుకల సందర్భంగా దశారథిని బంధించిన ఖిల్లా జైలును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే పనులు జరుగుతున్నాయి. జూలై 22 వేడుకలను వైభవంగా నిర్వహించేలా రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ ఈ నెల 13న నిజామాబాద్‌కు వచ్చి ఖిల్లా జైలు ఆవరణను పరిశీలించారు. కానీ వర్షాలతో ఈ వేడుకలను వాయిదా వేశారు.

అనస్త్రీషియా వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రమేశ్



ఆర్మూర్‌టౌన్: అనస్త్రీషియా వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ రమేశ్‌ను వైద్యులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అశోక్ మాట్లాడుతూ.. డాక్టర్ రమేశ్ పేదలకు వైద్యం అధించడంలో ముందుంటూనే కరోనా సమయంలో విశేష సేవలందించారని కొనియాడారు. డాక్టర్ రుద్ర శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి సాయి, కృష్ణమూర్తి, ఆంద్రోస్, సంపత్, నరేందర్, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

నేడు భీంగల్ ఆర్టీసీ డిపోను పరిశీలించనున్న మంత్రి

ఖలీల్‌వాడి: భీమ్‌గల్ పట్టణంలోని ఆర్టీసీ డిపోను రోడ్లు భవనాలశాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్టీసీ ఈడీ మునిశేఖర్ శనివారం పరిశీలించనున్నారు. ఈ డిపోను కొన్నేళ్ల క్రితం మూసివేశారు. దీనిని పునరుద్ధరించి ఇక్కడి ప్రజలకు ప్రజా రవాణాను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇక్కడ ఉన్న బస్సు డిపోకు కావాల్సిన వసరులు, రూట్లు, డిపోలో ఉన్న సామగ్రి తదితర వివరాలను ఆర్టీసీ ఈడీ మునిశేఖర్ సేకరించనున్నట్లు తెలిసింది.

రేషన్ పంపిణీలో అక్రమాలు

- నాలుగు నెలల నుంచి అందని బియ్యం
- డీలర్‌ను నిలదీసిన లబ్ధిదారులు



షాపు వద్ద డీలర్‌ను నిలదీస్తున్న లబ్ధిదారులు

బిచ్కుంద(జుక్కల్): రేషన్ పంపిణీలో అక్రమాలు జరగకుండా ప్రభుత్వం ఎన్నో మార్పులు తీసుకొచ్చి బయోమెట్రిక్ వేలిముద్రల ద్వారా సరుకులు పంపిణీ చేస్తోంది. కానీ మండలంలోని హజ్గుల్ గ్రామ రేషన్ డీలర్ చేతివాటం ప్రదర్శించి నాలుగు నెలల నుంచి బియ్యం పంపిణీ చేయకుండా కొందరు లబ్ధిదారుల పేరుపై బియ్యం ఇచ్చినట్లు రికార్డులు సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నాడు. గురువారం లబ్ధిదారులు రేషన్ షాపునకు వెళ్లి డీలర్‌ను నిలదీశారు. గోదాం నుంచి తీసుకొచ్చిన బియ్యం ఎక్కడ ఉన్నాయి. నాలుగు నెలల నుంచి పేదల కడుపుకొట్టి బియ్యం అమ్ముకున్నాడని డీలర్‌పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు రోజులు కొందరికే బియ్యం పంపిణీ చేసి మిగతా వారికి బియ్యం అయిపోయాయని, కొరత సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నాడు. సరుకులు అందని వారు ముందు బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు ఇస్తే ఎఫ్‌సీఐ గోదాం నుంచి బియ్యం తెప్పిస్తానని డీలర్ అబద్ధాలు చెప్పి బియ్యం ఇవ్వకుండానే వేలి ముద్రలు తీసుకొని నాలుగు నెలల నుంచి బియ్యం అమ్ముకుంటున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి నెలా 50 నుంచి 70 మందికి బియ్యం ఇవ్వకుండా ఎగనామం పెట్టి అమ్ముకొని లబ్ధి పొందుతున్నాడు. హజ్గుల్, సిర్‌సముందర్ గ్రామాలకు కలిపి హజ్గుల్‌లో ఒకే రేషన్ షాపు ఉంది. దీని కింద వెయ్యి రేషన్ కార్డులు ఉన్నాయి. లబ్ధిదారులు తహసీల్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు విచారణ చేయగా గోదాం నుంచి డీలర్ బియ్యం తీసుకెళ్లినట్లు ఉంది. సుమారు 70 క్వింటాలు అక్రమాలకు పాల్పడినట్లు ఉందని రెవెన్యూ అధికారులు డీలర్‌పై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

షాపులో తనిఖీలు చేస్తాం

లబ్ధిదారులు డీలర్‌పై ఫిర్యాదు చేశారు. ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులకు సమాచారం ఇచ్చాం. షాపు, స్టాక్ రికార్డులు తనిఖీ చేస్తాం. అక్రమాలకు పాల్పడినట్లు అనుమానాలు ఉన్నాయి. డీలర్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

–సాయిబాబా, ఆర్‌ఐ బిచ్కుంద

ఒకే నెల బియ్యం ఇచ్చారు

రేషన్ డీలర్ అక్రమాలకు పాల్పడుతున్నారు. వేలి ముద్రలు తీసుకొని మా పేరుతో బియ్యం అమ్ముకుంటున్నారు. గత నెల నా వేలి ముద్రలు తీసుకొని వచ్చే నెలలో రెండు నెలల బియ్యం ఇస్తానని చెప్పి ఒకే నెల బియ్యం ఇచ్చాడు. హజ్గుల్‌లో చాలా మంది వేలి ముద్రలు తీసుకొని వారి పేరుతో బియ్యం లేపుకొని డీలర్ అమ్ముకుంటున్నాడు.

–ఖలీల్, హజ్గుల్

అమెరికా వెళ్లేవారు మధ్యవర్తులను నమ్మొద్దు



రైతులతో మాట్లాడుతున్న అమెరికా హైదరాబాద్ కాన్సులేట్ మేనేజర్ క్యాత్రిన్ గ్రీస్‌మెన్

భిక్కనూరు: అమెరికా వెళ్లేవారు మధ్యవర్తుల మాటలు నమ్మకుండా నేరుగా కాన్సులేట్‌ను సంప్రదించాలని అమెరికా హైదరాబాద్ కాన్సులేట్ మేనేజర్ క్యాత్రిన్ గ్రీస్‌మెన్ అన్నారు. భిక్కనూరు రైతు వేదికలో అమెరికాకు చెందిన పలువురు అధికారులు రైతులతో శుక్రవారం సమావేశమయ్యారు. పంటల వివరాలు, ప్రభుత్వం కొనుగోలు విషయమై తెలుసుకున్నారు. అమెరికాకు చదువుకోవడానికి వెళ్లేవారి సంరక్షణకు అక్కడి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతుందని చెప్పారు. కొందరు బ్రోకర్లు మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారని, వారిని నమ్మవద్దన్నారు. జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఏడీఏ అపర్ణ, ఏవో రాధ, ఎంపీపీ జాంగారి గాలిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, ఏఈవోలు వినోద్‌గౌడ్, అఖిల, ఆనంద్, రజిత, రవి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడలో ఆయన మాట్లాడారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండిపోయాయని, ప్రజలు అవసరమైతే తప్ప బయటకి వెళ్లవద్దని సూచించారు. వాతావరణ శాఖ మరో వారం రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పాత ఇళ్లలో ఉండవద్దని, మట్టి గోడలు కూలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థులు బయట తిరగవద్దని అన్నారు.

మణిపూర్ అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నేతలు

కామారెడ్డి టౌన్: మణిపూర్‌లో యువతిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉపాధ్యాయ, విద్యార్థి, అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ముందు అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నేతలు మాట్లాడుతూ.. మణిపూర్‌లో ముగ్గురు మహిళలను వివస్త్రలను చేసి, నగ్నంగా ఊరేగించి వారిపై అత్యాచారం చేశారని దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని కోరారు.

శాంతియుత వాతావరణం నెలకొల్పాలి

కామారెడ్డి టౌన్: మణిపూర్‌లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటిగౌడ్, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్‌లు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. మహిళలను అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

యువ క్రికెటర్‌కు బాసటగా ఎమ్మెల్సీ



అరవింద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కవిత

నవీపేట : మండలంలోని లింగాపూర్‌లోని నిరుపేద కుటుంబానికి చెందిన యువ క్రికెటర్ ఈర్నాల అరవింద్‌కు అండగా ఉంటానని ఎమ్మెల్సీ కవిత హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంప్ ఆఫీసులో ఆమెను కలిసి, కుటుంబ పరిస్థితిని వివరించారు. జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రికెటర్ ఈర్నాల అరవింద్‌ను సొంత డబ్బుతో ఉన్నతమైన అకాడమీలో చేర్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, లింగాపూర్ సర్పంచ్ బత్తూర్ సాయిలు తదితరులు ఉన్నారు.

మరింత ఉన్నతస్థాయికి ఎదగాలి

నిజామాబాద్ అర్బన్ : విద్యార్థులు ఉన్నతంగా చదివి ఉన్నత స్థానాలకు చేరాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో న్యూ అంబేడ్కర్ భవన్‌లో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి న విద్యార్థులకు 2022–23 అకాడమీ ఎక్స్‌లె న్స్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. అతిథులు డీఐఈవో రఘురాజ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా ప్రతిమారాజ్, డా రాంమోహన్ రెడ్డి, డాక్టర్ బిలోజి నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల సాధారణ కూడా విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫలితాలు సాధించడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్‌సింగ్,, ఇందూరు యువత అసోసియేషన్ అధ్యక్షుడు సాయి, టీవీయూవీ జిల్లా కన్వీనర్ అజయ్, నవీన్, సుభాష్, సందీప్ పాల్గొన్నారు.

ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ముగ్గురికి ఎస్సైల నుంచి సీఐలుగా పదోన్నతులు లభించాయి. నగరంలోని 5వ టౌన్ ఠాణా ఎస్సై సాయినాథ్, 6వ టౌన్ నుంచి నిర్మల్‌కు బదిలీ అయిన ఎస్సై సాయికుమార్‌గౌడ్‌కు, అలాగే ముత్యంరాజుకు సీఐలుగా పదోన్నతులు లభించాయి. కామారెడ్డి జిల్లా నుంచి ఎస్సై పబ్బప్రసాద్, శ్రీధర్‌రెడ్డికి సైతం సీఐలుగా పదోన్నతులు వచ్చాయి.

తెరపివ్వని వరుణుడు



గోజేగావ్ లోలెవల్ వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



గుడి తండాలో లోలెవల్ వంతనపై నుంచి..



నెమ్లిలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు



హన్మాజీపేట్ శివారులో నీటమునిగిన పంట



అడ్లూర్‌ఎల్లారెడ్డిలో కూలిన ఇల్లు



భిక్కనూరులో..

- పొంగుతున్న వాగులు, వంకలు.. అలుగెల్లిన చెరువులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

సాక్షి నెట్‌వర్క్:వరుణుడు తెరపివ్వకుండా కురుస్తుండటంతో పలు గ్రామాల్లో చెరువులు నీటితో నిండాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొన్న చోట్ల రోడ్లు కొట్టుకుపోగా రాకపోకలకు అంతరాయమేర్పడింది. వాగులు వంతెనలపై నుంచి ప్రవహిస్తుండటంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీట మునిగాయి. శిథిలావస్థలో, బలహీనంగా ఉన్న ఇళ్లు నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలాయి. కొన్ని చెరువులకు గండిపడింది.

మహారాష్ట్రలో సైతం భారీ వర్షాలు కురుస్తుండడంతో మద్నూర్ మండలంలోని పలు గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. రాకపోకలు తెగిపోయాయి. లెండి, మంజీర వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పరీవాహక గ్రామాల చుట్టూ వరద నీరు చేరింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటు గడుపుతున్నారు. ముసురు వానకు చాలా మట్టుకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. వేలాది ఎకరాల్లో పంటలు నీటిలో మునిగిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని పంటలు నాశనమయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.




బ్రాహ్మణపల్లిలో పాక్షికంగా కూలిన ఇల్లు..



మాందాపూర్ - జనగామ మధ్య ప్రవహిస్తున్న ఎడ్లకట్ట వాగు



భిక్కనూరు: అంతంపల్లిలో నీట మునిగిన వైకుంఠధామం



కొట్టుకుపోయిన నల్లమడుగు-రామలక్ష్మణ్‌పల్లి రోడ్డు



పెద్ద శక్కర్గ- మహారాష్ట్ర రహదారి



శివాపూర్‌లో కూలిన ఎరుకల పోచయ్య ఇల్లు



పాల్వంచ మండలం ఫరీదుపేటలో..



అమర్లబండ చెరువుకు గండి

క్రైం కార్నర్

హత్యాయత్నం కేసులో నాలుగేళ్ల జైలుశిక్ష

ఖలీల్‌వాడి: హత్యాయత్నం కేసులో సయ్యద్ ఇక్రముద్దీన్‌కు నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీకాంత్‌బాబు శుక్రవారం తీర్పు వెల్లడించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాలు.. నిజామాబాద్ నగరంలోని హస్మీ కాలనీకి చెందిన సయ్యద్ ఇక్రముద్దీన్ మద్యం తాగడానికి రైల్వే స్టేషన్ వద్ద ఉన్న టానిక్ వైన్‌షాపు పర్మిట్ రూమ్‌లోకి వెళ్లాడు. అక్కడ మద్యం తాగుతున్న బాలాజీ సంగ్రామ్, షేక్ ఆమేర్‌ను మద్యం పోయమని అడిగాడు. వారు నీకెందుకు పోయాలనడంతో తన జేబులోంచి బ్లేడ్ తీసి ఆమేర్ గొంతుపై కోశాడు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి ఇక్రముద్దీన్‌కు నాలుగేళ్ల కఠిన జైలుశిక్ష తోపాటు రూ.1000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా రెండు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని జడ్జి శ్రీకాంత్‌బాబు తీర్పులో పేర్కొన్నారు.

కుక్కల దాడిలో 12 మేకల మృతి



వర్ని: మండలంలోని పొట్టి గుట్ట తండాలో మేకల మందపై కుక్కలు దాడి చేయడంతో 12 మేకలు చనిపోయాయి. గ్రామానికి చెందిన కాత్రోత్ వసంత్ తన మేకలను షెడ్డులో ఉంచగా శుక్రవారం తెల్లవారు జామున కుక్కలు దాడి చేసి 12 మేకలను చంపాయి. మృతి చెందిన మేకల విలువ సుమారు రూ.లక్ష 75 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

బస్సు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

కామారెడ్డి క్రైం: ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన దేవునిపల్లిలో శుక్రవారం ఉదయం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన దేవల నారాయణ పాల వ్యాపారం చేస్తున్నాడు. రోజూ మాదిరిగా పాలు పోసి సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా కామారెడ్డి నుంచి పిట్లం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో నారాయణ కాలు నుజ్జునుజ్జయింది. వెంటనే అతడిని ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలించారు.

కారు బోల్తా



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్టపై నుంచి కిందకు దిగుతుండగా కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు యువకులు ఆల్టో కారులో ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చారు. ప్రాజెక్టును చూసిన తర్వాత కిందకు దిగుతుండగా కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఒకరికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. క్షతగాత్రులను వెంటనే హైవే అంబులెన్స్‌లో నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది. ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: ఆర్మూర్‌లోని బాలాజీ ఫంక్షన్ హాల్ వద్ద గల కూరగాయల మార్కెట్‌లో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి రూ.30,400, ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని ఆర్మూర్ ఠాణాలో అప్పగించారు.

సాధన చేశారు.. సాధించారు



ఈ చిత్రంలో కనిపిస్తున్న వేల్పూర్ మండలం మోతె ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకార వేతనాని(ఎన్‌ఎంఎంఎస్)కి ఎంపికయ్యారు. ఈ పాఠశాల ఉపాధ్యాయులు చొరవ చూపి విద్యార్థులతో దరఖాస్తులు చేయించి పరీక్షలో విజయం సాధించే విధంగా శిక్షణ ఇస్తున్నారు. దీంతో ప్రతిసారి ఈ పాఠశాల నుంచి విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపిక అవుతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో ఎన్‌ఎంఎంఎస్‌కు 205 మంది విద్యార్థుల ఎంపిక
- ఇంటర్ వరకు అందనున్న స్కాలర్‌షిప్

నిజామాబాద్‌అర్బన్: సర్కార్ బడుల్లో చదువుతున్న విద్యార్థుల ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో అందిపుచ్చుకుంటున్నారు. ఇటీవల ప్రకటించిన జాతీయ ప్రతిభా ఉపకార వేతనాల(ఎన్‌ఎంఎంఎస్) ఫలితాలే అందుకు నిదర్శనం. ఈ స్కాలర్‌షిప్‌కు ఉమ్మడి జిల్లాలో 205 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సాహించాలని కేంద్ర ప్రభుత్వం మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ అందజేస్తుంది. ఎనిమిది, తొమ్మిది తరగతి విద్యార్థులకు పరీక్ష పెట్టి ఎంపికైన ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇంటర్ వరకు ఉపకారం వేతనం అందజేస్తోంది. ఈ ఏడాది నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ఉమ్మడి జిల్లా విద్యార్థులు సత్తాచాటి 205 మంది ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లా నుంచి 130 మంది, కామారెడ్డి జిల్లా నుంచి 75 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

చొరవ చూపితే మరింత ప్రయోజనం

ఉమ్మడి జిల్లాలో కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల చేత దరఖాస్తు చేయించాడనికే పరిమితం కాకుండా విద్యార్థులు పరీక్షలో విజయం సాధించే విధంగా శిక్షణనిస్తున్నారు. దీంతో ఆయా పాఠశాల విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికవుతున్నారు. కానీ చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు దీనిపై చొరవ చూపడం లేదు. కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నా.. ఉపాధ్యాయుల అలసత్వంతో ఉమ్మడి జిల్లాలో అనేకమంది విద్యార్థులు ఉపకార వేతనానికి దూరమవుతున్నారు. ఆయా ప్రభుత్వ పాఠశాల పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులతో దరఖాస్తులు చేయించి పరీక్ష రాయించాల్సి ఉన్నా.. కొందరు మాత్రమే చొరవ తీసుకొని దరఖాస్తులు సమర్పిస్తున్నారు. ఉపాధ్యాయులు చొరవ చూపి విద్యార్థులను పరీక్షకు సిద్ధం చేస్తే మరింత మందికి ప్రయోజనం కలుగుతుంది.

ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు అందేలా టీచర్లు ప్రోత్సహించాలి. దీంతో విద్యార్థులు లబ్ధి పొందుతారు. అన్ని పాఠశాలల్లో టీచర్లు ఈ విధంగా కృషి చేయాలి.

– దుర్గాప్రసాద్, డీఈవో